

ప్రత్యూషోదయం కాగానే కృష్ణానది పరివాహాల గల శ్రీ పర్వత శ్రేణులు బాజా భజంత్రీల ప్రతి ధ్వనులతో మారు మ్రోగు తున్నాయి.

అతనికి మెలకువ వచ్చింది. గుహలోంచి బయటకు వచ్చి చెట్ల చాటుగా క్రిందికి చూశాడు. మామిడి తోటల మధ్యనున్న ఆ గ్రామంలో ఏదో ఉత్సవం జరుగు తున్నట్టుగా ఉంది. బాజాలు మ్రోగు తున్నాయి. ఉత్సవం చూడాలని అతని మనస్సు ఆరాట పడుతూంది.

ఎన్నాళ్ళయిందో తాను ఈ కొండల్లోకి వచ్చి. జనుల్ని జనపదుల్ని చూడాలని ఎన్నో సార్లు క్రిందికి దిగాలను కున్నాడు. కాని ఏదో భయంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకొనేవాడు.

ఈనాడు మాత్రం అతను తనను తాను నిగ్రహించుకోలేక పోయేడు. క్రిందికి దిగి గ్రామంలో అడుగు పెట్టే ముందు కృష్ణలో స్నానం చేసి మరీ వెళ్ళాడు.

ఆది బౌద్ధుల ఉత్సవం. ఉత్సవంలో అతనూ తిరుగు తున్నాడు. ప్రజలు అతన్నొక దిగంబర సన్యాసిగా భావించేరు. తనని ఎవరూ శంకించనందుకు

కొలిప్ర వీరభద్రుడు

# అమర శిల్పుడు

అతను సంతోషంగా తిరగసాగాడు.

ఒకచోట పెద్ద పందిరి ఉంది. లోపల చిన్న స్థూపం ఉంది. పీత వస్త్ర ధారణలో కొంతమంది బౌద్ధ భిక్షువులు అక్కడ కూర్చుని ఏదో చదువుతున్నారు. బయట ప్రజలు నృత్యగానాలతో కాలక్షేపం చేస్తున్నారు.

అతను మహదానందంతో ఆ ఉత్సవాన్నలా చూస్తూనే ఉన్నాడు. సూర్యాస్తమయం కావడంతో జన సంచారం తగ్గింది. యాత్రికులకు ప్రత్యేకించి ఏ ఏర్పాట్లూ లేవు. అంచేత ఏ చెట్టు క్రిందనో తలదాచుకొంటున్నారు. అతను కూడా ఒక చెట్టు కింద విశ్రమించాడు.

మరునాడు ఉదయాన్నే లేచి అతను ఆ గ్రామం చూడాలని బయలుదేరేడు. గ్రామం అంత పెద్దది కాదు. ఊరికిచివర కమ్మరులు, వడ్రంగులుఉన్నారు. వాళ్ళని చూడగానే అతనిలో ఉత్సాహం ఉత్తేజం కలిగాయి. వారి నుంచి సుత్తి, శానము, ఉలి మొదలైన పరికరాలు సంపాదించాడు.

ఉత్సవం పూర్తి కాగానే అతను కొండపై గల తన గుహలోకి వచ్చేశాడు. గుహను పరిసరాలను శుభ్ర పరిచాడు. పనిలో లీనమయ్యాడు.

శానం కదులుతోంది. సమ్మెట కూడ పని చేస్తోంది. పెద్ద పెద్ద రాళ్ళు ముక్కలవుతున్నాయి. ఆ గుహ కొన్నాళ్ళకి విశాలంగా మారిపోయింది. రెండు మూడు గదులుగా మారిపోయింది.

గ్రామస్తులకు అతను ఉండే స్థలం తెలిసిపోయింది. ఆ శ్రీపర్వత గుహల్లో చాలా మంది సాధువులున్నారు. అతను కూడా ఒక సాధువుగా పరిగణించబడ్డాడు. చూడ్డానికి వచ్చిన గ్రామస్తు లతనికి ఆహార పదార్థాలు సమర్పిస్తున్నారు. అతనలా మమేకంగా రాళ్ళను విగ్రహాలుగా మలచడంలో నిమగ్నమై ఉంటున్నాడు.

గుహల గోడలు, సూర్యరశ్మికి మెరుస్తున్నాయి. గుహలో గృహాలు తయారవుతున్నాయి. గోడలమీద వివిధ భంగిమలలో అనేక రకాలైన ఆకారాలు రూపులు దిద్దు కుంటున్నాయి. అతనలా గోడల మీద చిత్ర విచిత్రములైన విగ్రహాలను చెక్కుతున్నాడు.

మాసాలు గడిచాయి. ఒక గోడ మీద ఒక అమ్మాయిని చెక్కాడు. ఆ బాలిక ప్రాకుతూంది. ఎవరి పాదాలనో తాకుతూంది. ఆ పాదాలు అందంగా ఉన్నాయి. అందమైన ఆ పాదాలయొక్క విగ్రహం ఇంకా తయారు కాలేదు. ఆ అమ్మాయిలో ఆ శిల్పి తన కుమార్తెను చూస్తున్నాడు.

శిల్పి చెక్కుతున్న ఆ మూర్తి ముఖం వరకు వచ్చింది సుకుమార చరణాలు నునుపైన నితంబం, క్షీణ కటిభాగం, పీన పయోధరాలు యవ్వనం నిండుగా ఉన్న విగ్రహమది. తన భార్య పోలికలు అతని కండ్లలో కనిపిస్తున్నాయి. ఆ స్త్రీ మూర్తి చెక్కడం పూర్తి అయింది.

ఆ ప్రక్కనే ఒక ముసలమ్మ విగ్రహం తయారయింది. ముడతలు పడిన ముఖం. లోతుగా ఉన్న కళ్ళు వంగి పోయిన భుజాలు. చినిగిన గుడ్డలతో సిగ్గుని దాచుకొంటున్నట్లు దా ముసలమ్మ. ఆ ప్రక్కనే మరొక మూర్తి— భూమి మీద ఒక రాయి పడి ఉన్నట్లుగా!

బాల్యం, యవ్వనం, వార్ధక్యం, మృత్యువు. జీవిత మందలి నాలుగు ముఖ్య ఘట్టాలకు ప్రతిబింబాలవి. ఆ శిల్పియొక్క వ్యక్తిగత అనుభవమే, అతని గుండెల్లోంచి ఒక రాయి తొలగిస్తే బయటకు వచ్చినట్లు ఆ రచన రూపంలో బయటకు వచ్చింది. అతని హృదయ మిప్పుడు ఆనందంతో తేలిపోతూంది. ఆ విగ్రహాలు చెక్కడం పూర్తి కాగానే అతను గంటల తరబడి కృష్ణలో స్నానం






చేశాడు. గుహలోకి వచ్చి మత్తుగా నిద్రపోయాడు.

కొత్త పని ప్రారంభానికి ముందు కొన్నిరోజులు విశ్రాంతి తీసుకోవాలనిపించిం దతనికి. ఒకనా డతను గుహకి ముందున్న రాయిపై కూర్చుని కిందికి చూస్తుండగా ఏదో ఉత్సవం ఎక్కడ్నుంచో వస్తూన్నట్టు కనిపించింది. కొంతమంది సైనికుల్లాంటి వాళ్ళు జండాలు పట్టుకొని ఉన్నారు. ఆ ఉత్సవం అలా ఆ గ్రామం దాటి కొండ లోయలోకి వెళ్ళిపోయింది. అత నా ఉత్సవం గురించి తెలుసుకోడానికి గ్రామంలోకి వెళ్ళాలను కున్నాడు. కాని మానేశాడు.

ఆ మరునాడు ఒక ముసలమ్మ ఎండు కట్టెల కోసం కొండ మీదికి వచ్చింది. ఉత్సవం గురించి శిల్పి ఆ ముసలమ్మ నడిగాడు.

ఆ రాజ్యాన్ని పరిపాలిస్తూన్న మహారాజా యుద్ధంలో జయించారనీ, ప్రజలు పండుగ చేసుకుంటున్నారనీ, రాజాగారు తమ గురువుగారైన నాగార్జునా చార్యుల వారిని కలుసుకోడానికి భ్రమర గిరికి నిన్న వెళ్ళారని మొదలైన విషయాలు ముసలమ్మ చెప్పింది.

అమితోత్సాహంతో శిల్పి ఆనాడు గ్రామంలోకి వెళ్ళాడు. అది వర్షాకాలం. వర్షం పడుతూంది. భిక్షువులంతా చెట్ల కింద వణుకుతూ నిల్చున్నారు.

శిల్పి ఒక కమ్మరి ఇంటికి వెళ్ళాడు. అక్కడొక భిక్షువు ఉన్నాడు.

"ఈ భిక్షువులంతా ఏ ఇంటికీ వెళ్ళకుండా ఇలా వర్షంలో తడుస్తున్నారేమండీ!" శిల్పి భిక్షువుని అడిగాడు.

"గృహాన్ని పరిత్యజించి పరివ్రాజకులైన వాళ్ళు మరల గృహాలలో ఉండలేరు కదా! వీళ్ళకి ఏ విహారమూ లేదు అక్కడ విశ్రమించడానికి" భిక్షువన్నాడు.

"మరి మీరు..."

"నేను కొత్తగా వచ్చిన వాడిని. ఇంకా ఈ నియమాలు పాటించలేదు."

"అయితే మీరు నా గుహలోకి వచ్చేయండి. ఇద్దరం కలిసి ఉందాం." శిల్పి శానాలు పట్టుకొని బయలు దేరుతూ అన్నాడు.

భిక్షువు కొంచెం సేపు ఆలోచించి "సరే పదండి" అంటూ శిల్పితో బయలు దేరాడు.

ఇద్దరూ గుహ చేరు కున్నారు. వర్షంలో తడిసి పోయారు. గుహలో ఒక మూల అగ్గి మండుతూంది. అక్కడ కూర్చుని ఇద్దరూ బట్టలు ఆరబెట్టు కున్నారు.

"మీ పేరు?" భిక్షు విడిగాడు.

"అగ్నివర్మ"

"మీరు కళాకారులా?" గోడలవైపుచూస్తూ భిక్షువడిగాడు.

"ఆ ఏదో రాళ్ళు చెక్కుతూ ఉంటాను."

"అలా అంటావేమిటయ్యా! నేను భారత దేశమంతటా తిరిగాను. కాని ఇలాంటి స్వతంత్ర రచన నాకెక్కడా కనిపించలేదంటే నమ్ము. నువ్వు గొప్ప శిల్పివోయ్."

"ఏదో మీరలా అంటున్నారు."

"మీరు ఈ ప్రాంతం వాళ్ళు కారా?" భిక్షువు మాటల్లో గౌరవం చోటు చేసుకుంది.



భైరవుడు

ఫోటో — శివశంకరయ్య

"కాదండి." అగ్నివర్మకి తన గురించి చెప్పుకోడానికి భయం కలిగింది. అందుకే మాట మారుస్తూ—"మీరు ఈ కంద మూలాలు తీసుకోండి.. మీపేరు?" అని అడిగాడు.

"నాపేరు చైతన్యుడు. ఆచార్యుల వారి వద్ద విద్య నభ్యసించాలని కొత్తగా వచ్చాను. మీరు ఆచార్యుల వారిని చూశారా?"

"లేదు కాని ఒక బౌద్ధ సన్యాసి ఉన్నట్లు విన్నాను. వారి పేరు నాకు తెలీదు."

"వారే నాగార్జునాచార్యులవారు. గొప్ప విద్వాంసులు. వారి దర్శనార్థమై పలు ప్రాంతాల నుంచి పరివ్రాజకులు వస్తూనే ఉంటారు. యజ్ఞశ్రీ మహారాజా కూడా ఆచార్యుల వారి శిష్యులే. మహారాజ అప్పుడప్పుడు వస్తూ ఉంటారు. వారిని చూడలేదా?"

"లేదు."

"కళాకారుడ వనిపించు కొన్నావయ్యా! మీ లోకమే వేరు.. సరే, రేపు నేను ఆచార్యుల వారితో నీ శిల్పాల గురించి చెబుతాను. ఆ తర్వాత వారిని మనం కలుద్దాం. ఇక మనం విశ్రాంతి తీసుకుందాం."

"అలాగే" అగ్నివర్మ ఏదో ఆలోచిస్తూ నిద్రలోకి జారాడు.

మరునాడు చైతన్యుడు ఆ చార్యుల వారితో అగ్నివర్మ ఉండే గుహ, అతని శిల్పాల గురించి వివరంగా చెప్పాడు. నాగార్జునాచార్యుల వారు శిల్పిని తీసుకు రమ్మని అనుజ్ఞ ఇచ్చారు. వెంటనే చైతన్యుడు అగ్నివర్మ దగ్గరికి వచ్చాడు.

"ఆచార్యుల వారిని దర్శనం చేసుకొనే భాగ్యం నాకు కలిగిందా?" చైతన్యుడు గుహలోకి వచ్చి రావడంతోనే అగ్నివర్మ అతన్ని అడిగాడు.

"మీ అదృష్టాని కేమండీ, మీరు గొప్ప కళాకారులు. ఆచార్యుల వారితో మీ గురించి విన్నవించగానే వారెంతో ఆనందించారు. రా, వెళ్దాం."

అగ్నివర్మకి భయం, సంశయం కలిగాయి. ఏదో అడగబోయి మానేశాడు. చైతన్యు డది గ్రహించాడు.

"ఏదో సంశయిస్తున్నట్టున్నారు?"

"మరేం లేదు. నేనూ..."

"ఆ మీరూ, చెప్పండి!"

"నేను భిక్షువుని కానుగదా, ఆచార్యుల వారు నాకు దర్శనం ఇస్తారా?"

"ఆచార్యుల వారికి అభ్యంతరాలేమిటండీ! వారికి జాతి మత పట్టింపులు లేవు. మహా చక్రవర్తి అయినా, నిరుపేదలైనా వారి వద్దకు నిస్సంశయంగా వెళ్ళవచ్చును. బౌద్ధ మతంలో అలాంటి అభ్యంతరాలు ఉండవు." నవ్వుతూ చైతన్యుడన్నాడు.

అగ్నివర్మకి తన చెవుల్లో అమృతం వర్షించి నట్టయింది. తన పరిశ్రమ నలుగురూ చూసే మంచి రోజులు వచ్చినందుకు మురిసి పోతున్నాడు. "నేటితో నా కలలు ఫలిస్తాయి. నలుగురూ నా పనితనాన్ని చూస్తారు" తనలోనే అనుకున్నాడు.

చైతన్యుడి వెనక నడుస్తూన్న అగ్నివర్మ పాదాలు ఆనందంతో తేలి పోతున్నాయి. ఇరువురూ భ్రమరగిరి చేరుకున్నారు.

ఒకానొక విశాల వృక్షం క్రింద ఉన్నత పీటంపై నాగార్జునా చార్యుల వారు గ్రంథ పఠనం సాగిస్తున్నారు. అతని కెదురుగా చాలా మంది భిక్షువులు కూర్చుని శ్రద్ధగా వింటున్నారు.

చైతన్యుడు దూరం నుంచే అగ్నివర్మకి ఆచార్యులవారిని చూపించాడు. అగ్నివర్మ అటూలున ఆగిపోయాడు. చైతన్యుడు ఆచార్యులవారి అనుమతి తీసుకుని అగ్నివర్మని అతని ముందుకు తీసుకు వెళ్ళాడు. అగ్నివర్మ ఆచార్యుల వారికి నమస్కరించాడు.

ఆచార్యుల వారి అనుజ్ఞతో భిక్షువులంతా అక్కడ నుంచి వెళ్ళిపోయారు. ఆచార్యులవారు అగ్నివర్మను సాదరంగా కూర్చోమని న్నారు.

"నేను శిల్పిని, నన్ను అగ్నివర్మ అంటారు." అగ్నివర్మ గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. గొంతు తడారి పోయింది. స్పష్టంగా మాట్లాడ లేక పోయాడు. శరీరమంతటా చెమట కమ్మింది. ఆచార్యులవారి సౌమ్య గంభీర విగ్రహం ముందు అగ్నివర్మ మూగ వాడిలా అయిపోతున్నాడు.

"అవును చైతన్యుడు చెప్పాడు. మీరు ఇంకేమైనా చేశారా?"

"ఎన్నో చేశాను. కాని ఇప్పుడా విగ్రహాలూ లేవు, దేవాలయమూ లేదు."

దీర్ఘ వ్యాధులకు ఉత్తమసిద్ధవైద్యం!



నరముల బలహీనత
ధాతుపుష్టి యవ్వనశక్తి
హెర్నియా చర్మవ్యాధులకు
పోస్టు ద్వారా కూడా కలదు
వరిబీజం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా-రండి

డా॥దేవర, ఫోన్: 551, మార్కెటుశివాల, తెనాలి.

బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు—17

మీకు బేబి/బాబుకావాలా!



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీ మణులు అనేకులు మా పరిశో లచే సంతాన వంతులయి చక్కని సౌభాగ్యతా ప్రతములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు. ఉచిత వివరములకు

శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రైల్వేస్టేషన్ వద్ద, రామాలయం వీధి,
తె నా లి - 2.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విశేషనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

౧

"అలయాలంటున్నారు, మీరు హిందువులా?"

"కాదండి, అయినా విగ్రహాలు చెక్కడం నాకు సరదా."

"మీకు వాటి మీద శ్రద్ధ ఉండి కాదా?"

అగ్నివర్మ ఏ సమాధానమూ ఇవ్వలేదు.

"సరే మీరు తయారు చేసిన ఆ మూర్తులను నేను చూడ వచ్చునా?"

"తప్పకుండా తమరు చూస్తామనడం నా అదృష్టం. నేనుండే గుహ ఇక్కడికి దగ్గర్లోనే ఉంది. దయచేయండి." అగ్నివర్మ వదనం వికసించింది.

"చైతన్య భిక్షువు మీ గుహ ఎరుగును గదా. రేపు వస్తాం. మంచిది."

అగ్నివర్మ ఆచార్యుల వారి వద్ద సెలవు తీసుకుని వెనక్కి వచ్చేశాడు. భిక్షువు అంతా యథా ప్రకారం ఆచార్యుల వారి సమక్షంలోకి వచ్చి కూర్చున్నారు.

నాగార్జునాచార్యులు తన గుహకు విచ్చేయడంతో అగ్నివర్మ మనస్సు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయింది. భిక్షువులంతా గుహ వెలుపలే ఆగిపోయారు. చైతన్యుడు ద్వారం వద్ద నిల్చున్నాడు. లోనికి వచ్చిన ఆచార్యులవారికి అగ్నివర్మ సాష్టాంగ ప్రణామం చేసాడు. ఆచార్యులు అతన్ని ఆశీర్వదించి పీటం మీద కూర్చున్నారు. మూర్తుల్ని పరికించారు.

"ఇవి దైవ సంబంధమైన మూర్తులు కావు గదండీ." ఆచార్యుల వారు అగ్నివర్మను అడిగారు.

"కావండి. అగోచరాలను ఎలా తయారు చెయ్యడం."

ఆచార్యుల వారు చిరునవ్వు నవ్వారు. "కల్పనా శక్తితో మూర్తీకరణ చేయవచ్చును గదా" అని అన్నారు.

"నిజమే కాని కల్పనా బలంతో మన ఇష్టం వచ్చినట్టు విగ్రహాలు నిర్మించ వచ్చును. నియంత్రణ అవసరం లేదు కాబట్టి. అయితే ఆ మూర్తులు కూడా అనియంత్రిత మవుతాయి."

"మీరు ఎవరి వద్ద విద్య నభ్యసించారు?"

"మా నాయనగారు శిల్పి. కాని ఆయన వద్ద నేర్చుకొనే అవకాశం నాకు లభించలేదు. నాసికలో కొన్నాళ్ళు నేర్చుకున్నాను. తర్వాత పరిసర గ్రామాలలో దేవాలయాలు నిర్మించాను. ఇప్పుడిక్కడ..." అగ్నివర్మ మరి మాట్లాడలేక పోయాడు.

"మీ రచనా వస్తువు చాలా ఉదాత్తమైనది కాని..."

"శాశ్వతమైనది కాదు" చైతన్య డన్నాడు. అగ్నివర్మ ఆచార్యుల వారిని చూస్తున్నాడు.

"అలాగయితే సర్వమూ, నశ్వరమే నాయనా! కొన్ని త్వరలో నాశనమవుతాయి, మరి కొన్ని కొంత కాలం గడిచాక. ఇవి రాళ్ళు కాబట్టి అంత త్వరలో నశించవు. సరే, ఇవి కాల్పనిక చిత్రాలు కావన్నారు గదా! మరి వీటికి మాతృక?" ఆచార్యులు ప్రశ్నించారు.

అగ్నివర్మ దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు.

"అభ్యంతరమయితే వద్దులెండి." ఆచార్య లన్నారు.

"లేదండి. వీటి గురించి చెప్పాలంటే ఈ దీనుడి గాథ చెప్పవలసి ఉంటుంది."

"అయితే చెప్పండి. శిల్పిగారి కథ వింటాం." చైతన్య డన్నాడు.

"నాదొక పెద్దగాథ. అయినా సంక్షిప్తంగానే చెబుతాను. ఆంధ్ర చక్రవర్తి యజ్ఞశ్రీ శాతవాహనుడికీ, రుద్ర దమనుడికీ జరిగిన మొన్నటి యుద్ధంలో సైనికులు గ్రామాలమీద పడి దోచుకో సాగారు. గ్రామాలు వదిలేసి ప్రజలు ఇటూ అటూ పరుగెత్త సాగారు. నేను ధాన్యకటకం వైపు బయలు దేరాను. దారిలో ఒక ముసలమ్మ నన్నెంతో ఆదరించింది. మేం అలా వెళ్తున్నప్పుడు ఒక సత్రంలో నాకు ఒకామెతో పొత్తు కలిసింది. ఫలితంగా మాకొక కుమార్తె పుట్టింది. ధాన్య కటకానికి దగ్గర్లో ఉన్న ఒకానొక గ్రామంలో తాపీపని చేసుకొంటూ జీవితం గడిపాం. ధాన్య కటకంలో దేవాలయాలు కట్టి విగ్రహాలు తయారు చేద్దామనే కోరిక నాకు చాలా కాలం నుంచీ ఉంది. అంచేత ఒకనాడు ధాన్యకటకం వెళ్ళాను. గూఢచారులు అనుమానించి నన్ను పట్టుకొన్నారు."

"కారణం?" చైతన్య డడిగాడు.

"నేను యవనుడి లాగ కనిపించడమే" అగ్నివర్మ అన్నాడు.

"అయితే మీరు యవనులా?" చైతన్యుడడిగాడు.

"ఏమో స్పష్టంగా నాకు తెలియదు. మాది గాంధార దేశమట. మానాయన గారు సౌరాష్ట్రం వలస వచ్చారట. సౌరాష్ట్రంలో నేనొక హిందూ గణికకు పుట్టానట. అదీ విషయం. నా వేషభాషలు చూసి శాతవాహనుల గూఢచారులు అనుమానించారు. నాపేరు, జాతి అడిగారు. నేనేమీ చెప్పలేక పోయాను. నన్ను రుద్రదమనుడి గూఢచారిగా భావించి పట్టుకొన్నారు. నన్ను విడిపించాలనే ఉద్దేశంతో నా భార్య ఆ సైనికులకు తన శరీరం అర్పించింది. దాంతో నాకు సంసారం మీద విరక్తి కలిగి కృష్ణానది దాటి ఈ కొండల్లోకి వచ్చేశాను." అగ్నివర్మ కొంచెం సేపు ఆగాడు. మళ్ళీ చెప్ప సాగాడు. "ఇంక ఈ మూర్తులంటారా, మరి ఎవరో కాదు. నా భార్య, కుమార్తె, ఆ ముసలమ్మ" అగ్నివర్మ ఆగిపోయాడు.

"పూజకోసం భగవంతుడి విగ్రహాలే ఉండాలి కదా!" అగ్నివర్మ ఏమిటి చెబుతాడా అని ఆచార్యులవారు అడిగారు.

అగ్నివర్మ కొంచెం సేపు ఆలోచించి గంభీరంగా అన్నాడు. "పూజ్యమగు వ్యక్తుల విగ్రహాలే ఉండాలి. మానవుడన్నా కావచ్చు. ఆదర్శవంతుడైన ఆ భగవంతుడు మన ఊహల్లోని రూపమే గదా. నాభావాల్ని ఈ విధంగా మలిచాను."

ఆచార్యులవారు గౌరవ దృక్కులతో అగ్నివర్మను చూస్తూ అన్నారు— "మీ మాటలు, మీ ఊహలు శిల్ప శాస్త్రంలో ఎంతో అనుభవజ్ఞులుగా మిమ్మల్ని బుజువు చేస్తున్నాయి. మీరు చేసిన ఈ రచన నాకెంతో నచ్చింది. ఇందులో మొదట శూన్యం చూపించారు. ఆ తర్వాత జననం. బాల్యం, యవ్వనమ్ము వార్ధక్యం [illegible]

చూపించారు. చివరలో మరల శూన్యం చూపించారు. ఓహో ఎంత గంభీరమైన చిత్ర మిది. సృష్టిలో గల సత్యాన్ని సంక్షిప్తంగా విశదీకరించారు. మీ రచన చాలా గొప్పది శిల్పిగారూ" ఆచార్యుల వారు ఎంతో ఆనందించారు.

"ఈ రచన తమకు నచ్చడంతో నా జన్మ ధన్యమయింది"

"శ్రీ పర్వతానికి వచ్చి మీరు ఇలా గుహల్ని తయారు చేశారు గదా! దానికి కారణం ఏదైనా ఉందంటారా?" ఆచార్యుల వారు అగ్నివర్మను అడిగారు.

"ఎవరికీ కనిపించకుండా నిర్జన ప్రాంతంలో గడపాలనే ఆనాడు ఈ కొండల్లోకి వచ్చాను. వాస యోగ్యంగా రాయిని తొలిచి గుహ తయారు చేశాను. అయినా ఆ పరిస్థితిలో నే నింకేం చెయ్యగలను. ఆదీగాక, కొండల్ని కొట్టి ఆ రాళ్ళతో ఆలయాలు కడుతూన్నప్పుడు ఆ కొండనే ఒక ఆలయంగా ఎందుకు కట్టకూడదు అనే ఉద్దేశం కూడా కలిగి ఈ గుహను మరింత విశాలం చేశాను. గోడలపై విగ్రహాలు చెక్కాను. దేవాలయాన్ని నిర్మించాలనే నా కోరికను ఈ విధంగా తీర్చుకొన్నాను."

"వీటినే గుహాలయాలంటారు. మీకు తెలియకుండానే మీరు ప్రప్రథమ గుహాలయ నిర్మాత లయ్యారు. ఈ గుహాలయం బౌద్ధ ధర్మం యొక్క అంతర్ముఖ సంకేతానికి ఉచితమైన రూపాన్నిస్తుందనే విషయం బహుశా మీరు ఊహించి ఉండరు." ఆచార్యులవారు భిక్షువుల కోసం ఇలాంటి గుహాలయాలు నిర్మించాలని చాలా కాలం నుంచి అనుకుంటున్నారు. ఈ నాటికి అలాంటి శిల్పి లభించడంతో ఆతనికెంతో ఆనందంగా ఉంది.

"తమరన్నది నిజం. నాకంతటి పరిజ్ఞానమెక్కడిది?" అంటూ అగ్నివర్మ తాను నిర్మించిన గుహ అంత గొప్పదా అని ఆశ్చర్యపోతున్నాడు.

"చూడండి శిల్పిగారూ! మనన, చింతన, మహోదీక్షణాలకు ఇలాంటి గుహలు ఎంతో ఉపయుక్తమైన సంకేతాలు. ఈ కార్యం బౌద్ధుల స్తూపాలకు గాని, హిందువుల మందిరాలకుగాని సాధ్యం కాదు. భ్రమర గిరిమీద, శ్రీ పర్వతం మీద మీరు ఇలాంటివే ఎన్నో గుహలు నిర్మించాలని మా కోరిక."

"చిత్తం. తమ ఆజ్ఞ శిరోధార్యం. తాము మన్నించాలి. నాదొక చిన్న సందేహం." అగ్నివర్మ అడిగాడు.

"అడగండి."

"అయితే ఈ గుహలలో భిక్షువులు తపస్సు చేస్తారా?"

"లేదు. భిక్షువు లిందులో నివాసముంటారు. ఏడాది పొడుగునా పర్యటన చేసే బౌద్ధ భిక్షువులు వర్షాకాలం రాగానే ఈ గుహాలయాల్లోకి వచ్చి ఉంటారు. గుహల్ని ఆవిష్కరించి ఇంత వరకూ ఎవ్వరూ చెయ్యని కార్యాన్ని మీరు చేదారు. మీరు ధన్యులు."

"మహా ప్రసాదం" అగ్నివర్మ శిరస్సు వంచాడు.

"మీ గుహను, శిల్పాలను రేపు వచ్చి చూడవలసిందిగా రాజా గారికి కబురంపుతాను. మేం కూడా రాజాగారితో వస్తాం." ఆచార్యుల వారు లేచారు.

"ధన్యుడ్ని. నేనే మహారాజ దర్శనార్థం వెళ్ళాలను కుంటున్నాను."

"మీ కా శ్రమ అక్కర్లేదు. రాజాగారే మీ వదకు వస్తారు. కళల్ని, కళాకారుల్ని పోషించడం రాజాగారి కర్తవ్యం." ఆచార్యులు బయటకు వచ్చారు. ఆచార్యుల వద సెలవు తీసుకొన్న అగ్నివర్మ రేపటి కోసం చూడసాగాడు.

* * *

యజ్ఞశ్రీ సప్తకర్ణి శ్రీపర్వతం పైనున్న అగ్నివర్మ గుహ చేరుకోగానే భేరీలు, శంఖ ధ్వానాలు ఆగిపోయాయి.

అక్కడొక సభ జరగడానికి కావలసిన ఏర్పాట్లన్నీ అంతకు ముందే నాగార్జునాచార్యులవారు చేయించారు. సభలో ఆచార్యుల వారు అగ్నివర్మను పరిచయం చేశారు.

"వీరే శ్రీ అగ్నివర్మ. ప్రపథమంగా గుహా నిర్మాణం గావించి బౌద్ధ భిక్షువుల కొక నివాస స్థలాన్ని సూచించారు. విహారాల కంటే ఇలాంటి గుహాలయాలే చిరస్థాయిగా ఉంటాయి. ప్రాచీనకాలం నుంచీ మన కళాకారులంతా తమ కళను చిరస్థాయిగా ఉంచడానికి రాళ్ళను చెక్కి అందమైన విగ్రహాలుగా మలిచారు. రాయి కంటే పర్వతం మరింత స్థిరంగా ఉంటుంది. బౌద్ధ ధర్మ ప్రతీకమైన గుహను నిర్మించిన మహాశిల్పి అగ్నివర్మ అభినందనీయులు. భిక్షుగణమంతా అతనికి ఋణపడి ఉంది" అంటూ ఆచార్యులవారు కూర్చున్నారు.

కరతాళ ధ్వనులు గుహలో ప్రతిధ్వనించాయి.

యజ్ఞశ్రీ మహారాజు లేచి అన్నారు—"ఆచార్యుల వారి వాక్కులు మనకు శిరోధార్యాలు. వారు వచించిన ప్రకారం శ్రీ అగ్నివర్మ కళాకారులు స్తవనీయులు. శిల్పిగారిని సన్మానిస్తూ నాకు సన్మానం జరిగినంతగా సంతోషిస్తున్నాను. ఇంతటికళాకారుడుమనరాజ్యంలో ఉన్నందుకు నేను గర్విస్తున్నాను. మరో విషయం. రాజా సర్వ ధర్మావలంబి. తన రాజ్యంలో ఉన్న ధర్మా లన్నిటినీ ప్రోత్సహించడం రాజు యొక్క కర్తవ్యం. ప్రజల ధర్మమే రాజ ధర్మం. . ."

సభలో కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి.

". . .ఈ స్థలంలోనే ఒక విశ్వవిద్యాలయం నెలకొల్పుతాం. అందులో ఆచార్యుల వారి ఆధ్వర్యంలో అధ్యయనం ఇప్పటివలెనే కొనసాగుతుంది. అయితే ఈ నాటి నుంచీ రాజ్యం తరుపునే అన్ని ఏర్పాట్లూ జరుగుతాయి. భవన నిర్మాణం, విద్యార్థులకు వసతి గృహాలు, భిక్షు పుంగవులకు గుహల నిర్మాణం మొదలైన కార్యాలు శిల్పిగారు ఆచార్యుల వారి పర్యవేక్షణలో పూర్తి చేస్తారు. నేటి నుండి ఈ పర్వత గుహలలోని శిల్పాలు ఆచార్యుల వారి పేరుతో ధన్యమవుతాయి". కరతాళ ధ్వనులతో సభ మారుమోగుతుంది.

అగ్నివర్మ లేచాడు. ఏదో మాట్లాడాలనుకున్నాడు. కంఠం రుద్ధమయింది. మాట్లాడ లేకపోయాడు. అతని నేత్రాలు భాష్ప జల పూరితా లయ్యాయి. అతి కష్టంతో "ధన్యవాదాలు" అని మాత్రం అనగలిగాడు. సభ ముగిసింది.

అగ్నివర్మ నాగార్జునాచార్యుల వారి పర్యవేక్షణలో అనేక గుహాలయాలు, వసతి గృహాలు నిర్మించాడు. బుద్ధభగవానుని చరిత్రకు సంబంధించిన సంనేక ఘట్టాలను కళా పరిభాషలో చెక్కాడు. నాగార్జున పర్వతం, నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున శిల్పాలు జగత్ ప్రసిద్ధి గాంచాయి.

(శ్రీ అరిగపూడి వారి 'ధన్యభిక్షు' అనే హిందీ నవల దీనికి ఆధారం)

# శరద్వేళ

శరదిందిర
చిరు అందెల
సవ్వడి వినిపించె.

శారద నీరదాలు
శృంగార రథాలై
నింగిని పయనించె.

చంద్రికాసారము కోరి
చలువరాతిపై వాలె చకోరి!
మరి మరి మురిపింప తెలిమబ్బు
మరులు రేకొని నర్తించె మయూరి!!

మందార సుందరిని
మిళిందము కూడె!
బృందావని కడ గో
విందుడు వేణువు పాడె!!

విరహోత్కంఠి యై
విరజాజి తీవె సుంత!
సిగ్గు పరదాలు దాటి
చేరె చేమంతి ప్రియుని చెంత!!

నీలాల నింగిలోని
వెలరేడు కన్ను గీటె!
కలువ కన్నె గుండెలో
వలపు వీణియ మీటె!

మరుడు వాడి
శరములు దూయ
విరహిణుల వేడి నిట్టూర్పుల
సెగలు పొగలై ఎగయ
చల్లని వెన్నెల సైతం
వాటిని చల్లార్చలేకపోయె!
తాళలేని తరుణి చెంతకు
ప్రియుడు వేళకేమో రాకపోయె!!

యమున ఉప్పొంగె!
హృదయమున రస
వాహిని ఉప్పొంగె!!
భావ జగాన ఈ శరద్వేళ!
ఆహో! ఏమి ఈ శరద్వేళ!

— టి. గౌరీశంకర్